సంపుటి :02 సంచిక :247 పేజీలు :07

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

సోమవారం 08, నవంబర్ 2025

మావోయిస్ట్ పార్టీ అగ్రనేత

# రాంధేర్ లొంగుబాటు

ఆయన వెంట మరో 10 మంది అగ్రనేతలు

- వీరిలో ఆరుగురు మహిళా మావోయిస్టులు
- రాంధేర్ తలపై రూ.కోటి రివార్డు
- తాజా లొంగుబాటుతో మావోయిస్టు రహిత ప్రాంతంగా ఎంఎంసీ జోన్

05






అక్షర దర్బార్ ఎఫెక్ట్

# జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- కపిల్ సస్పెన్షన్ ను ధృవీకరించిన జిల్లా రిజిస్ట్రార్
- 'అక్షరదర్బార్' ఎఫెక్ట్

04

## అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు రుజువు కావడంతో నిర్ణయం

హనుమకొండ జిల్లా బీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన జూనియర్ అసిస్టెంట్ కపిల్ పై రిజిస్ట్రేషన్ శాఖ కొరడా ఝుళిపించింది. ఈ అక్రమాలపై గతంలో 'అక్షరదర్బార్' లో ప్రచురించిన కథనానికి స్పందనగా ఉన్నతాధికారులు చేపట్టిన విచారణలో ఆరోపణలు రుజువయ్యాయి. ముఖ్యంగా సెలవులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ స్థానంలో ఉండి, ఏకంగా 21 లావాదేవీలను అక్రమంగా పూర్తి చేసినట్లు నిర్ధారణ కావడంతో, కపిల్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ సస్పెన్షన్ విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్ అధికారికంగా ధృవీకరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఈ నిర్ణయంతో స్పష్టమైంది.

– అక్షర దర్బార్, హనుమకొండ

సన్న బియ్యమూ

# రీసైక్లింగ్

## పీడీఎస్ సన్నబియ్యాన్ని అమ్ముతున్న కొందరు రేషన్ షాపుల డీలర్లు

- కొనుగోలు చేసి ప్రభుత్వానికి సీఎంఆర్ గా డెలివరీ చేస్తున్న రైస్ మిల్లర్లు
- సీఎంఆర్ కోసం రైస్ మిల్లర్లకు సర్కార్ కేటాయిస్తున్న ధాన్యం మార్కెట్ కు..
- తాజాగా వరంగల్ ఎల్బీనగర్ లోని ఓ రేషన్ షాపు డీలర్ సన్నబియ్యం విక్రయం
- ఆ బియ్యం దామెరలోని రాజరాజేశ్వరి రైస్ మిల్ కు చేరిన వైనం
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న సివిల్ సప్లై అధికారులు

06



పేదల కోసం ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం స్థానంలో కొద్ది నెలల నుంచి సన్న బియ్యాన్ని ఇస్తుంది. తద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు తగ్గుతాయని, రేషన్ డీలర్లు సన్నబియ్యాన్ని అమ్మటం, రైస్ మిల్లర్లు కొనుగోలు చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గా డెలివరీ చేయడం ఉండకపోవచ్చని ప్రభుత్వం భావించింది. కానీ.. రీసైక్లింగ్ యధావిధిగా కొనసాగుతుంది. తగ్గేదేలే.. అనే రీతిలో కొందరు రేషన్ డీలర్లు, రైస్ మిల్లర్స్ వ్యవహరిస్తున్నారు. పేదలకు పంపిణీ చేయడం కోసం ప్రభుత్వం తమకు సరఫరా చేసిన సన్నబియ్యాన్ని కొందరు రేషన్ డీలర్లు దర్జాగా అమ్ముతున్నారు. వీటిని కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లర్లు సీఎంఆర్ గా ప్రభుత్వానికి డెలివరీ చేస్తున్నారు. తమ స్వప్రయోజనాల కోసం ఇలా చేస్తున్న రైస్ మిల్లర్లు.. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి తమకు కేటాయించిన ధాన్యాన్ని ఎంచక్కా మార్కెట్ లో అమ్మి లాభాలు గడిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు అన్నీ తెలిసి కూడా చూసి చూడనట్లు నడుచుకుంటుండటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. తాజాగా జరిగిన సంఘటన ఇందుకు అద్దం పడుతుంది.

- అక్షరదర్బార్, వరంగల్

## ఆ రోజుల్లో స్థానిక సెలవు

జిల్లా కలెక్టర్ సత్యశారద





# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

- 2047 నాటికి కల సాకారం చేస్తాం
- పారిశ్రామికవేత్తలకు ఇదే మా ఆహ్వానం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఫ్యూచర్ సిటీలో `తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవం

02

# ఆమె ఓటే కీలకం!






## జిల్లాల వారీగా ఓటర్లు

| జిల్లా | పురుషులు | మహిళలు |
|---|---|---|
| భూపాలపల్లి | 1,47,388 | 1,54,744 |
| జనగామ | 1,98,525 | 2,02,963 |
| ములుగు | 1,10,838 | 1,18,299 |
| వరంగల్ | 1,88,139 | 1,95,589 |
| మహ-బాద్ | 2,73,692 | 2,83,064 |
| హన్మకొండ | 1,80,666 | 1,90,201 |

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహిళా ఓటర్లే విజేతలను నిర్ణయించే కీలక శక్తిగా అవతరించారు. భూపాలపల్లి, జనగామ, ములుగు, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాల పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్లే వేల సంఖ్యలో అధికంగా ఉన్నారు. హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 9,535 మంది మహిళలు అధికంగా ఉండగా, అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ కారణంగానే, సర్పంచ్ అభ్యర్థులంతా మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రచార వ్యూహాలను రచిస్తున్నారు. మహిళా ఓటర్లు ఏ వైపు మొగ్గు చూపితే, ఆ అభ్యర్థే విజయాలను అందుకునే అవకాశం ఉండడంతో, వారి ఓటు ఈ ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా మారనుంది.

- **ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లదే హవా**
- **పంచాయతీ ఎన్నికల్లో ఆమే న్యాయనిర్ణేత**
- **అన్ని జిల్లాల్లో పురుషుల కంటే వనితల ఓట్లే అధికం**
- **హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 9,535 మంది మహిళలు అధికం**
- **మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు**
- **ఊరూరా వారి సమస్యలు తెలుసుకుని హామీలు**

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :
అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. మొదటి దశ పోలింగ్ ఈ నెల 11న, రెండో విడత పోలింగ్ 14న, మూడో విడత పోలింగ్ 17న జరుగనుంది. ఈ నేపథ్యంలో అన్ని ప్రధాన పార్టీల నుంచి సర్పంచ్ పదవికి పోటీచేసే అభ్యర్థులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. బతిమాలాడో, ప్రలోభపెట్టో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. అయితే.. ఉమ్మడి వరంగల్‌జిల్లాలోని మహబూబాబాద్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ, ములుగు, వరంగల్ జిల్లాల పరిధిలో మహిళా ఓటర్లు కీలకమయ్యారు. ఎందుకంటే ఆరు జిల్లాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

### - ఓటర్ల సంఖ్య ఇలా..

భూపాలపల్లి జిల్లాలో పురుష ఓటర్లు 1,47,388 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,54,744 మంది ఉన్నారు. జనగామ జిల్లాలో పురుషులు 1,98,525 మంది ఉండగా, మహిళలు 2,02,963 మంది ఉన్నారు. ములుగు జిల్లాలో 1,10,838 మంది ఉండగా, మహిళలు 1,18,299 మంది ఉన్నారు. వరంగల్ జిల్లాలో పురుషులు 1,88,139 మంది ఉండగా, మహిళలు 1,95,589 మంది ఉన్నారు. మహబ ాబాబాద్ జిల్లాలో పురుషులు 2,73,692 మంది ఉండగా, మహిళలు 2,83,064 మంది ఉన్నారు. హనుమకొండ జిల్లాలో పురుషులు 1,80,666 మంది ఉండగా, మహిళలు 1,90,201 మంది ఉన్నారు. మొత్తంగా మహిళల ఓటర్లు పంచాయతీ ఎన్నికల్లో పైచేయి గా ఉన్నారు. వారు ఎవరికి ఓటు వేస్తే వారే విజేత అనేది తేలిపోయింది.

### - వ్యత్యాసం ఇలా..

భూపాలపల్లి జిల్లాలో పురుషుల కంటే 7,356 మంది మహిళలు అధికంగా ఉన్నారు. జనగామ జిల్లాలో పురుషుల కంటే అధికంగా 4,438 మంది మహిళలు ఉన్నారు. ములుగు జిల్లాలో పురుషుల కంటే 7,461 మంది మహిళలు అధికంగా ఉన్నారు. వరంగల్ జిల్లాలో 7,450 మంది మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 9,372 మంది మహిళలు పురుషుల కంటే అధికంగా ఉన్నారు. అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 9,535 మంది మహిళలు పురుషుల కంటే అధికంగా ఉన్నారు.

### - మహిళా ఓటర్ల ప్రసన్నానికి యత్నాలు..

మహిళా ఓటర్లు కీలకంగా మారుతుండటంతో వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో నాయకులు ఉన్నారు. ఇప్పటికే మొదటి విడత నామినేషన్ల దాఖలు పూర్తవడంతో మహిళా ఓటర్ల మద్దతు పొందేందుకు బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. పోటీలో నిలుస్తున్న అభ్యర్థులు ప్రత్యేకంగా మహిళలను కలిసి స్థానిక సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి హామీలు గుప్పిస్తున్నారు. ఏ గ్రామానికి ఆ గ్రామంలో సమస్యలను మహిళలు అభ్యర్థులకు చెప్తున్నారు. ఆ సమస్యలను పరిష్కరిస్తే గానీ, ఓటు వేయలేమని తెగేసి చెప్తున్నారు. కొందరు అభ్యర్థులైతే స్వంత ఖర్చులతో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మరీ వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు.

# రేపటితో మొదటి విడత ప్రచారం బంద్

- **11న ఆయా పంచాయతీల్లో పోలింగ్**
- **ముమ్మర ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నం**



అక్షరదర్బార్, వరంగల్ : తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారానికి రేపటితో తెరపడనుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ర్ 9వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలతో ప్రచారం ముగియనుంది. ఆ తర్వాత మైకులు, బహిరంగ సభలు, రోడ్‌షోలు బంద్ కానున్నాయి.మరోవైపు 11వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికారులు పోలింగ్‌కు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3,836 గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తయిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. వెనువెంటనే ఫలితాలు విడుదల కానున్నాయి. అదే రోజు ఉప సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహిస్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భారీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.



# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

- **2047 నాటికి కల సాకారం చేస్తాం**
- **పారిశ్రామికవేత్తలకు ఇదే మా ఆహ్వానం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **ఫ్యూచర్ సిటిలో `తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' ప్రారంభోత్సవం**

అక్షరదర్బార్, హైదరాబాద్ : కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 2047వ సంవత్సరం నాటికి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ఆశయమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'లో భాగంగా సోమవారం నిర్వహించిన ప్రారంభోత్సవ వేడుకలో సీఎం ప్రసంగించారు. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి విలువైన ఆలోచనలు, అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది తమ లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని లక్ష్యంగా పెట్టుకుందని గుర్తుచేశారు. లక్ష్యం పెద్దదైనప్పటికీ, కష్టపడి పని చేసి దానిని సాధిస్తామనే నమ్మకం తమకుందని ధీమా వ్యక్తం చేశారు. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్‌ల నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్ర కల సాకారమైందని పేర్కొన్నారు. దేశ జనాభాలో కేవలం 2.9 శాతం ఉన్నప్పటికీ, దేశ ఆదాయంలో తెలంగాణ ప్రస్తుతం 5 శాతం వాటాను అందిస్తోందని చెప్పారు. ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణను మూడు జోన్లుగా విభజించినట్లు వెల్లడించారు. సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు వీటిని కేటాయించామని తెలిపారు. వీటిని క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నామని వివరించారు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్నామని, 20 ఏళ్లలోనే అత్యధిక పెట్టుబడులు సాధించిన ఆ నమూనాను ఇక్కడ అమలు చేయదలిచామని తెలిపారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాలు తమకు ఆదర్శమని సీఎం అన్నారు.

అక్షర దర్బార్
Voice of the people
www.aksharadarbar.com
సోమవారం
08.12.2025


# ప్రజలకు సత్వర న్యాయం చేయండి



**- భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్**

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ శిరీశెట్టి సంకిర్త్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 6 గురి అర్జీదారులను పరిశీలించారు వారి సమస్యలను వివరంగా తెలుసుకొని, సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే ద్వారా పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు. స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వినతులను నమోదు చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించేలా సూచనలు జారీ చేశామని పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం పోలీస్ శాఖ యొక్క ప్రధాన బాధ్యతగా పనిచేస్తున్నట్లు ఎస్పీ స్పష్టంచేశారు.

# మొబైల్ ఫోన్ అప్పగింత



అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: ముల్కలపల్లి గ్రామానికి చెందిన ఒనపాకాల అజయ్ అనే యువకుడికి సంబంధించిన మొబైల్ ను సోమవారం మొగుళ్ళపల్లి లో పోగొట్టుకున్నాడు. బాధితుడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయటంతో ఎస్సై బి అశోక్ ఆదేశాలతో సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ జ్యోతి ఫోన్ యొక్క ఐఎంఈఐ నెంబర్ సహాయంతో లొకేషన్ ట్రేస్ చేసి గంట వ్యవధిలోనే బాధితునికి హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ మొబైల్ ఫోను అందించారు. బాధితుడు మొగుళ్లపల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏకగ్రీవ సర్పంచులకు సన్మానం

- సన్మానించిన ఎమ్మెల్యే గండ్ర
- జిల్లాలో 18 మంది సర్పంచుల ఏకగ్రీవం
- మొగుళ్లపల్లి మండలంలో ఇద్దరు



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులను భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. భూపాలపల్లి జిల్లాలో 18 మంది సర్పంచులు ఏకగ్రీవం కాగా మొగుళ్లపల్లి మండలంలోని బద్దం పల్లి గ్రామానికి చెందిన బద్దం రామ్ రెడ్డి. గుడిపహాడ్ గ్రామానికి చెందిన కుమ్మరి సాంబయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వారిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలల్లో సర్పంచ్ పదవి ప్రజలకు నేరుగా సేవ చేసే గొప్ప బాధ్యత అని, ప్రజలందరి సంఘీభావంతో ఏకగ్రీవ సర్పంచ్ నిర్ణయం ప్రజాస్వామ్యంలో మంచి సాంప్రదాయమని సర్పంచ్ లందరికీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొత్తగా ఎన్నికైన సర్పంచ్ లు గ్రామాలల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టి పారదర్శక పరిపాలనతో గ్రామాభివృద్ధికి సేవ చేయాలన్నారు. గ్రామ ప్రజల ఐక్యతతో, అభివృద్ధి లక్ష్యంతో ఏకగ్రీవంగా సర్పంచ్ లను ఎన్నుకోవడం సంతోషమన్నారు. ఈ నిర్ణయం గ్రామ సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు గాజర్ల అశోక్ ఎర్రబెల్లి పున్నం చందర్రావు ఆళ్ల తిరుపతిరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# ఓసీ సింహ గర్జన సభను విజయవంతం చేయాలి

అక్షర దర్బార్, నర్సంపేట : వరంగల్‌లో జనవరి 11న జరిగే ఓసీ సింహ గర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. నర్సంపేటలో జరిగిన సమావేశంలో ఆయన గోడపత్రికను ఆవిష్కరించారు. ఓసీ వర్గాల బీద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించాలని, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను ఐదు సంవత్సరాల కాలపరిమితితో షరతులు లేకుండా జారీ చేయాలని, ఆదాయ పరిమితిని 10 లక్షలకు పెంచాలని ప్రభుత్వంను డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, టెట్ అర్హత మార్కులను 90 నుండి 70కు తగ్గించాలని సూచించారు. సభకు ఓసీ బాంధవులు, మహిళలు, మేధావులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో ఓసీ జేఏసీ నాయకులు కండి గోపాల్ రెడ్డి, ఎర్ర యాకుబ్ రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మల్లక్క పేట 2వ వార్డులో ఐదోసారి ఏకగ్రీవం

- ఏకగ్రీవ పరంపర కొనసాగించిన అంబిరు మహేందర్

అక్షరదర్బార్, పరకాల: పరకాల మండలం మల్లక్క పేట గ్రామానికి చెందిన 2వ వార్డు మరోసారి ఏకగ్రీవం సాధించడం గ్రామంలో హర్షం వ్యక్తమవుతోంది. గత ఇరవై సంవత్సరాలుగా ఐదు సార్లు వరుసగా ఏకగ్రీవంగా వార్డు సభ్యుడిని ఎన్నుకోవడం ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది.తాజా స్థానిక ఎన్నికల్లో గురిజాల సుప్రియ శివరామకృష్ణ 2వ వార్డు సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏకగ్రీవానికి కృషి చేసిన ముఖ్య నాయకుల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంబిరు మహేందర్ కృషి అభినందనీయమని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. 2వ వార్డు గ్రామంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఏకగ్రీవానికి గ్రామ ప్రజల ఐక్యతే ప్రధాన బలం. గతంలో లాగే ఈసారి కూడా ఏకగ్రీవం సాధించడం ఆనందంగా ఉందని, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పరకాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. రాజు, నాయకులు భాస్కర్, రాజు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే ప్రథమ ఎజెండా

- కత్తెర గుర్తును గెలిపించండి, గ్రామ అభివృద్ధికి సహకరించండి.
- గెలుపు నీదే అంటున్న ప్రజలు..
- ప్రచారంలో దూసుకెళ్తున్న మహేందర్ రెడ్డి



అక్షరదర్బార్, పరకాల: వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో అభివృద్ధి పథకాలు అమలు చేయడమే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ మద్దతుదారుడు, సర్పంచ్ అభ్యర్థి పెండ్యాల మహేందర్ రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామ ప్రజలు కూడా మహేందర్ రెడ్డికి ఉత్సాహభరితంగా స్పందిస్తూ "గెలుపు నీదే... అభివృద్ధి నీవల్లే సాధ్యం" అంటూ మద్దతు తెలియజేస్తున్నారు. సోమవారం గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించిన మహేందర్ రెడ్డి, కత్తెర గుర్తుకు ఓటు వేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలను అభ్యర్థించారు. గ్రామంలోనే ఉండి, ప్రజల సమస్యలన్నీ బాగా తెలిసిన వ్యక్తినని, "ఎన్నికల కోసమే రావడం లేదు... గ్రామం కోసం పని చేయడానికే వస్తున్నా" అని ఆయన స్పష్టం చేశారు.ఈ మాటలు గ్రామస్తుల్లో మంచి విశ్వాసాన్ని కలిగించగా, యువత నుండి వృద్ధుల వరకు మహేందర్ రెడ్డిని ఆశీర్వదిస్తూ "మా ఓటు నీకే" అని ఏకగ్రీవంగా అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.ఈ నెల 11న జరగనున్న స్థానిక ఎన్నికల్లో గ్రామస్థుల పూర్తి సహకారంతో భారీ మెజారిటీతో విజయం ఖాయం అని మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి, పారదర్శకత, ప్రజా సేవలను ముఖ్యంగా తీసుకుని ముందుకు సాగుతానని పునరుద్ఘాటించారు.

# జర్నలిస్టుకు నాగూర్ల పరామర్శ



అక్షర దర్బార్, నర్సంపేట: వరంగల్ జిల్లా, నర్సంపేట పట్టణానికి చెందిన,ఈనాడు స్టేట్ బ్యూరోగా పనిచేస్తున్న ఆకారపు మల్లేశం తల్లి లక్ష్మీ నర్సమ్మ ఇటీవల పరమపదించగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసినా తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జెండా రాజేష్, కె.ఎన్ రావు తో పాటు ఇతర పాత్రికేయులు పాల్గొన్నారు.



# జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు దుగ్గొండి కేజీబీవీ విద్యార్థిని ఎంపిక

అక్షర దర్బార్, దుగ్గొండి G జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి లో గల కస్తూరిబా బాలికల గురుకుల విద్యాలయం విద్యార్థిని ఎంపికైనట్లు గురుకుల ప్రత్యేక అధికారి మంజుల సోమవారం తెలిపారు ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో మంజుల మాట్లాడుతూ కేజీబీవీ కి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమీరా ఇటీవల హైదరాబాదులో నవంబర్ 22, 23, 24 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో 68 కేజీల విభాగంలో తన ప్రతిభను చాటి ప్రథమ స్థానంలో బంగారు పతకం కైవాసం చేసుకుని జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. దీంతో 69వ ఏ స్ జీ ఎఫ్ ఐ అండర్ 17 తెలంగాణ జట్టుకు ఎంపికైంది. ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్లోని బలియాలో జరిగే పోటీలకి సమీరా ఆడనున్నట్లు తెలిపారు. సమీరా ను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు అభినందించారు



# వైభవంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

**: కలెక్టర్ రాహుల్ శర్మ**

అక్షర దర్బార్, భూపాలపల్లి : ఈ సంవత్సరం తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డిసెంబర్ 9న జరిగే అధికారిక "తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం"లో భాగంగా, మంగళవారం ఉదయం 10 గంటలకు ఐడీఓసీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున, MCC నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ కార్యక్రమం నిర్వహించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, డీఈ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలపై అవగాహన

అక్షర దర్బార్ శాయంపేట : ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకొని వరంగల్ కమీషనరేట్ ఎలాగైనా ఇట్టి నేరలను ఆపాలనే ఉద్దేశ్యం తో తీసుకున్న ఆలోచన ప్రకారం తీసుకువచ్చిన సైబర్ సారథి 1930, ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ అనే ప్రోగ్రామ్ తో ప్రజలకు అవగాహనా కల్పించాలని శాయంపేట మండలంలోని ఎంజెపి బాలుర హాస్టల్ లో అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పరకాల ఎసిపి సి. సతీష్ బాబు పాల్గొని పిల్లలకు సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్, గోల్డెన్ అవర్ రిపోర్టింగ్, ఫ్రాడ్ లింక్స్ మరియు ఓటీపీ షేరింగ్ గురించి తెలిపి ఇట్టి వాటిపై జాగ్రత్తగా ఉండాలని పిల్లలని హెచ్చరించినారు.ఈ కార్యక్రమంలో సిఐ గోపి, సిసి ఎస్,శాయంపేట సీఐ పి. రంజిత్ రావ్,ఎస్సై జె. పరమేశ్వర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# బీఆర్ఎస్‌లో చేరిక

అక్షర దర్బార్, నల్లబెల్లి : నల్లబెల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన తంగెళ్ల అనిల్, నాగపురి రమేష్ బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు క్యాతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేడిపల్లి రాజగౌడ్, గుండాల సుమన్, పరపాటి రవి, తంగేళ్ల అనిల్, సుకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవ సర్పంచ్ లకు
# మంత్రి సీతక్క సన్మానం


అక్షర దర్పర్/ములుగు జిల్లా ప్రతినిధి:ములుగు మండలంలోని కొత్తూరు గ్రామంలో,గ్రామపంచాయితీ ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్టి సుదర్శన్ ని గ్రామంలోని ప్రజలందరూ ఏకగ్రీవం చేయగా, సోమవారం ములుగు జిల్లా కేంద్రంలోనీ, క్యాంపు కార్యాలయంనందు తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి,స్త్రీ–శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క) సుదర్శన్ ని సన్మానించి, పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి మధు, గ్రామ ప్రధాన కార్యదర్శి ఇండ్ల రవి, యాపలగడ్డ పెద్దమనిషి గడ్డి, మల్లయ్య గ్రామంలోని సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు రుజువు కావడంతో నిర్ణయం
- కపిల్ సస్పెన్షన్ ను ధృవీకరించిన జిల్లా రిజిస్ట్రార్
- 'అక్షరదర్బార్' ఎఫెక్ట్

అక్షరదర్బార్, హనుమకొండ : హనుమకొండ జిల్లా బీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న జూనియర్ అసిస్టెంట్ కపిల్ పై సస్పెన్షన్ వేటు పడింది. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో తాజాగా రిజిస్ట్రేషన్ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. బీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ సెలవులో ఉన్న సమయంలో ఈ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ కపిల్ అక్రమంగా 21 రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపణలు రావటంపై గత నవంబర్ 6న 'ఆఫీసర్ ఆన్ అక్రమాల డ్యూటీ' శీర్షికన 'అక్షరదర్బార్' పత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. తీవ్రంగా పరిగణించిన రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు జూనియర్ అసిస్టెంట్ కపిల్ ను బీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి డిప్యూటేషన్ పై జనగామ జిల్లా కొడకండ్లలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపారు. ఈ నేపథ్యంలో జూనియర్ అసిస్టెంట్ కపిల్ నవంబర్ 1, 3, 4 తేదీల్లో 15 ప్లాట్లు, ఆరు ఇండ్లను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. విచారణలో ఆరోపణలు వాస్తవమేనని తేలినట్లు సమాచారం. ఈ మేరకు విచారణ అధికారి అందజేసిన నివేదిక ప్రకారం జూనియర్ అసిస్టెంట్ కపిల్ పై రెండు రోజుల క్రితం సస్పెన్షన్ వేటు పడినట్లు తెలిసింది. జూనియర్ అసిస్టెంట్ కపిల్ ను సస్పెన్షన్ చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్ వెల్లడించారు. దీంతో ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు ఎదుర్కొన్న జూనియర్ అసిస్టెంట్ కపిల్ పై చర్యలు ఉండేనా? అనే అనుమానాలకు, చర్చకు తెరపడింది.


ఆఫీసర్ ఆన్ అక్రమాల డ్యూటీ
కాసుల కోసం జూనియర్ అసిస్టెంట్ బరితెగింపు

# నల్లబెల్లిలో గులాబీ జెండా ఎగురడం ఖాయం

**శనిగరంలో బీఆర్ఎస్ లో భారీగా చేరికలు**

అక్షర దర్బార్, నల్లబెల్లి : స్థానిక ఎన్నికలకు ముందు నల్లబెల్లి మండలంలో బీఆర్ఎస్ పటిష్టంగా బలం పెంచుకుంటోంది. శనిగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు యాదవ సంఘం సొసైటీ అధ్యక్షుడు సుంకరి రమేష్, మాజీ వార్డు మెంబర్ పొన్నం రవి గౌడ్, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ దండు రాజు, కుర్మిల్ల రాజు—— పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించిన బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు డా. బానోతు



సారంగపాణి, పాక్స్ చైర్మన్ చెట్టు పల్లి మురళీధర్, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. మాల్లో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు ప్రజల మద్దతు పెరుగుతోందని, గడచిన రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి లేదని విమర్శించారు. "420 హామీలు, 6 గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలలో ప్రజలు సమాధానం చెప్పే సమయం వచ్చింది" అని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి అశోక్, కక్కెర్ల శోభన్, బసవరాజుల భాస్కర్, నీలం సుధాకర్, కొలగని జంపయ్య, దండు శ్రీనివాస్, ఉట్కూరి రాజేందర్, ఉట్కూరి శ్రీనివాస్, బూర శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు పోలేపాక రాజు, మామిడి పల్లి రాజు, పూజారి రాజు, పూజారి రంజిత్, ఓరుగంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పోరులో పట్టభద్రురాలు..!

**ఒక్కసారి అవకాశం ఇవ్వాలని వేడుకోలు**



అక్షర దర్బార్ వెంకటాపూర్ : సమీపిస్తున్న స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో ఉంగరం గుర్తుకు ఓటు వేసి సర్పంచిగా విద్యావంతురాలినైన నాకు అవకాశం కల్పించాలని గడపగడపకు వెళ్లి ఓటర్లను బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి శ్రీమతి పోశాల అనిత – వీరమల్లు అభ్యర్థిస్తున్నారు. సోమవారం గ్రామాల్లోని వివిధ వాడల్లోని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలను తెలుసుకుని సర్పంచ్ ఎన్నికల్లో ఉంగరం గుర్తు గల నమూనా బ్యాలెట్ పేపర్ ను చూపిస్తూ ఓటు వేయాలని వేడుకున్నారు. సమాజ అభివృద్ధికి చదువు కూడా ముఖ్యమేనని అన్నారు. ప్రచార పర్వాన్ని మమ్మురం చేస్తూ ఉత్సాహంగా దూసుకుపోతున్నారు.



గ్రామంలోని సమస్యలను తీర్చడమే తన మొదటి కర్తవ్యం అని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి తన విధులు నిర్వర్తిస్తానని, తనకు సర్పంచ్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ ఇచ్చి సర్పంచిగా గెలిపించాలని ఈ సందర్భంగా వేడుకున్నారు..





# వైభవంగా పల్లివేట

అక్షర దర్బార్, నర్సంపేట : శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం సిల్వర్ జూబ్లీ మండల పూజలలో భాగంగా నర్సంపేటలో పల్లివేట కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. పల్లివేట దాతగా BJP జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి వ్యవహరించారు. శంకరన్ నంబూద్రి తాంత్రిక పూజలు నిర్వహించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్ అయ్యప్పస్వామి విగ్రహాన్ని తలపై ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. శబరిమలై వాయిద్య బృందం, భక్తుల శరణుఘోషలు పట్టణాన్ని మారుమ్రోగించాయి. కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్, ట్రస్ట్ చైర్మన్ సింగరికొండ మాధవ శంకర్, దేవాలయ గురు స్వాములు, ట్రస్ట్ సభ్యులు, మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.




# శాంతి భద్రతల పరిరక్షణకే పోలీస్ ఫ్లాగ్ మార్చ్

## డీఎస్పీ సంపత్ రావు

అక్షర దర్బార్ చిట్యాల : స్థానిక సర్పంచ్ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా డిఎస్పి సంపత్ రావు అన్నారు. సోమవారం చిట్యాల మండల కేంద్రంలో సీఐ మల్లేష్ యాదవ్ ఎస్సై శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం డిఎస్పి మాట్లాడుతూ ప్రజల భద్రతకు పోలీసులు నిత్యం అండగా ఉంటారని శాంతి భద్రతకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని అనవసర గొడవల జోలికి వెళ్లి కేసుల్లో ఇరుక్కోవద్దని ఆయన అభ్యర్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల ఎస్సై సుధాకర్. చిట్యాల సెకండ్ ఎస్సై ఈశ్వరయ్య. ఏఎస్ఐ మధుసూదన్. సమ్మిరెడ్డి. హెడ్ కానిస్టేబుళ్లు యాకయ్య. సురేందర్. కానిస్టేబుల్ అస్లాం. లాల్ సందీప్. రంజిత్. నాగరాజు. ఉమెన్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి గేమ్స్ లో జాకారం గురుకుల విద్యార్థుల ప్రతిభ

## - అభినందించిన ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి :జిల్లాస్థాయి గేమ్ లో జాకారం గురుకుల విద్యార్థులు ప్రతిభ కనపరచడంతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ వెంకటేశ్వర్లు అభినందించారు. సోమవారం పి ఎం శ్రీ జిల్లా స్థాయి గేమ్స్ , అథ్లెటిక్ పోటీలలో అద్భుతమైన ప్రతిభ జాకారం గురుకుల విద్యార్థులు కనపరిచారు. అండర్ 17 పోటీలలో కబడ్డీలో మొదటి స్థానం, వాలీబాల్లో మొదటి స్థానం, కో కో లో మొదటి స్థానం, ఫుట్ బాలులో మొదటి స్థానం సాధించి డీఈవో సిద్ధార్థ్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. అథ్లెటిక్ విభాగంలో కూడా లాంగ్ జంప్ లో ఏ. రాంచరణ్ గోల్ మెడల్ షాట్పుట్ లో కౌంస్య పతకం సాధించినాడు. 100 మీ పరుగులో ఎన్. చరణ్ కౌంస్య పతకం సాధించి ఓవరాల్ జిల్లా ఛాంపియన్గాగా నిలిచారు. అన్ని క్రీడలలో తమ జాకారం గురుకుల విద్యార్థులు మొదటి బహుమతులను సాధినందుకు పిడి వెంకట రెడ్డినీ పి ఇ టి చంద్రమౌళినీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పి ఈ టి, ఫీడిలు అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.




# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ఎస్.ఐ -2 హేమలత

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం కేంద్రం లోని మోడల్ స్కూల్ లో సోమవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిట్యాల ఎస్.ఐ-2 (SI-2) హేమలత పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాల గురించి వివరించారు. ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియాలో జరిగే నేరాలు మరియు అపరిచిత వ్యక్తుల పట్ల ఎంత జాగ్రత్తగా ఉండాలో విద్యార్థులకు తెలియజేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం, సైబర్ నేరాల పట్ల తాము జాగ్రత్తగా ఉంటామని, ఇతరులకు అవగాహన కల్పిస్తామని విద్యార్థుల చేత ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ (HC) రామకృష్ణ, మహిళా కానిస్టేబుళ్లు మమత, నాగమణి మరియు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






# ఓటు చోరీపై కాంగ్రెస్ సంతకాల సేకరణ

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోరీ వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ దొంగ ఓట్లతోనే అధికారంలోకి వస్తోందని, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటానికి ప్రజలు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంజాన్ అలీ, ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, ఒంటరి శ్రావణ్ కుమార్, దుబాసి వెంకటస్వామి, మార్క రఘుపతి గౌడ్, మడికొండ సంపత్, డా .మడికొండ శీను, దార్న వేణుగోపాల్, బొమ్మకంటి చంద్రమౌళి, జాఫర్, బొచ్చు బాబు, దుప్పటి సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.



# ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మామిడి శెట్టి సుగుణ స్వామి
- మంత్రి సీతక్క అండ తో అభివృద్ధి

అక్షర దర్బార్ వెంకటాపూర్ : సర్పంచ్ ఎన్నికల్లో తనను ప్రజలు ఆదరించి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మామిడి శెట్టి సుగుణ స్వామి అన్నారు. సోమవారం ప్రచారంలో భాగంగా ఓటర్లతో మమేకమై సర్పంచి ఎన్నికల్లో తన గెలుపుకు ఓటర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి సీతక్క అండతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. తొమ్మిదవ వార్డ్ మెంబర్ పసుల కోటయ్య తో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు.

# భారీ మెజార్టీ తో గెలిపించాలి

## ములుగు మండల యూత్ ప్రెసిడెంట్ కాసర్ల రాజు



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: నియోజకవర్గంలో జరుగుతున్న మూడు విడతల స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న సర్పంచ్ వార్డు మెంబర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ములుగు మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు కాసర్ల రాజు అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి భారీ మెజార్టీతో అభ్యర్థులను గెలిపించాలని ఆయన అన్నారు ఆయన అన్నారు.

# అవినీతి రహిత సమాజమే లక్ష్యం

*** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




అక్షరదర్బార్, హనుమకొండ: అవినీతి రహిత సమాజం ఏర్పాటు చేయడం మన అందరి లక్ష్యమని వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఇక్కడ అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. హనుమకొండ జూనియర్ కళాశాల నుండి అశోక సెంటర్ వరకు జరిగిన ఈ అవగాహన ర్యాలీలో విద్యార్థులతో పాటు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఏసీబీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించడం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని, భవిష్యత్తులో అవినీతి నిర్మూలనలో విద్యార్థి, యువత పాత్ర చాలా కీలకమని, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య. ఇన్ స్పెక్టర్ రాజు ఇతర ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ రోజుల్లో స్థానిక సెలవు

అక్షరదర్బార్, వరంగల్: జిల్లాలో ఈ నెల 11, 14, 17 వ తేదీల్లో మూడు దశల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్ లు, వార్డ్ సభ్యుల ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుటకు గాను ఆయా తేదీల్లో స్థానిక సెలవుగా ప్రకటిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు, కలెక్టర్ కు దత్తత చేయబడిన అధికారాల మేరకు జిల్లాలో సర్పంచ్ లు, వార్డ్ సభ్యుల స్థానాలకు పోలింగ్ జరుగు ఆయా ప్రదేశాల్లో వివిధ ప్రభుత్వ, ఉద్యోగులకు సాధారణ సెలవు, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించినట్లు తెలిపారు. అందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఓటర్లు తప్పకుండా తమ విలువైన ఓటును పోలింగ్ రోజున వినియెగించుకోవాలని కలెక్టర్ కోరారు.





# సన్న బియ్యమూ రీసైక్లింగ్

- పీడీఎస్ సన్నబియ్యాన్ని అమ్ముతున్న కొందరు రేషన్ షాపుల డీలర్లు
- కొనుగోలు చేసి ప్రభుత్వానికి సీఎంఆర్ గా డెలివరీ చేస్తున్న రైస్ మిల్లర్లు
- సీఎంఆర్ కోసం రైస్ మిల్లర్లకు సర్కార్ కేటాయిస్తున్న ధాన్యం మార్కెట్ కు..
- తాజాగా వరంగల్ ఎల్బీనగర్ లోని ఓ రేషన్ షాపు డీలర్ సన్నబియ్యం విక్రయం
- ఆ బియ్యం దామెరలోని రాజరాజేశ్వరి రైస్ మిల్ కు చేరిన వైనం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

అక్షరదర్బార్, వరంగల్ : పేదల కోసం ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం స్థానంలో కొద్ది నెలల నుంచి సన్న బియ్యాన్ని ఇస్తుంది. తద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు తగ్గుతాయని, రేషన్ డీలర్లు సన్నబియ్యాన్ని అమ్మటం, రైస్ మిల్లర్లు కొనుగోలు చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) గా డెలివరీ చేయడం ఉండకపోవచ్చని ప్రభుత్వం భావించింది. కానీ.. రీసైక్లింగ్ యధావిధిగా కొనసాగుతుంది. తగ్గేదేలే.. అనే రీతిలో కొందరు రేషన్ డీలర్లు, రైస్ మిల్లర్స్ వ్యవహరిస్తున్నారు. పేదలకు పంపిణీ చేయడం కోసం ప్రభుత్వం తమకు సరఫరా చేసిన సన్నబియ్యాన్ని కొందరు రేషన్ డీలర్లు దర్జాగా అమ్ముతున్నారు. వీటిని కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లర్లు సీఎంఆర్ గా ప్రభుత్వానికి డెలివరీ చేస్తున్నారు. తమ స్వప్రయోజనాల కోసం ఇలా చేస్తున్న రైస్ మిల్లర్లు.. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసి తమకు కేటాయించిన ధాన్యాన్ని ఎంచక్కా మార్కెట్ లో అమ్మి లాభాలు గడిస్తున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు అన్నీ తెలిసి కూడా చూసి చూడనట్లు నడుచుకుంటుండటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. తాజాగా జరిగిన సంఘటన ఇందుకు అద్దం పడుతుంది.

**- రేషన్ షాపు నుంచి రైస్ మిల్లుకు**

టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం వరంగల్ లో ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఆటోలో రవాణా అవుతున్న 20 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియాన్ని పట్టుకున్నారు. ఇదే రోజు హనుమకొండ జిల్లా దామెర మండలంలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులో నిల్వ ఉన్న 20 క్వింటాళ్ల పీడీఎస్ సన్న బియ్యాన్ని కూడా పట్టుకున్నారు. అయితే ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడిన 20 క్వింటాళ్ల బియ్యం, దామెరలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులో పట్టుబడిన 20 క్వింటాళ్ల బియ్యం కూడా ఒకే రేషన్ షాప్ నుంచి బయటకు వచ్చినట్లు తెలిసింది. ఇంతేజార్ గంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 20 క్వింటాళ్ల పీడీఎస్ సన్న బియ్యంతో పట్టుబడిన ఆటో ద్వారా ముందుగా ఇరవై క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యాన్ని వరంగల్ ఎల్బీనగర్ లోని ఓ రేషన్ షాపు నుంచి ఓ వ్యాపారి ఇదే ఆటో ద్వారా 20 క్వింటాళ్లు తీసుకెళ్లి దామెరలోని రాజరాజేశ్వరి రైస్ మిల్లులో డంప్ చేసి వచ్చినట్లు తెలిసింది. తర్వాత మరో 20 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యాన్ని అదే రాజరాజేశ్వరి రైస్ మిల్లుకు ఆటో ద్వారా తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్ ఫోర్స్ పోలీసులకు పట్టుబడినట్లు సమాచారం. సీఎంఆర్ గా ప్రభుత్వానికి డెలివరీ చేసేందుకు రాజరాజేశ్వరి రైస్ మిల్ యజమాని ఈ పీడీఎస్ సన్నబియాన్ని కొనుగోలు చేసినట్లు తెలిసింది

**- కిలోకు రూ.16**

వరంగల్ ఎల్బీనగర్ లోని రేషన్ షాపు డీలర్ నుంచి వ్యాపారి భానుచందర్ కిలో రూ.16 చొప్పున సన్నబియాన్ని కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ బియ్యాన్ని కిలో రూ.25 చొప్పున అమ్మేందుకు సదరు వ్యాపారి రాజరాజేశ్వరి రైస్ మిల్ యజమానితో ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. పీడీఎస్ సన్న బియ్యాన్ని రేషన్ షాప్ నుంచి తీసుకెళ్లి రైస్ మిల్లులో డంప్ చేసే బాధ్యత సదరు వ్యాపారిదే. ఈ క్రమంలో వ్యాపారి భానుచందర్ తన ఆటో ద్వారా ఒక ట్రిప్పులో 20 క్వింటాళ్లను వరంగల్ ఎల్బీనగర్ లోని రేషన్ షాపు నుంచి తీసుకెళ్లి రాజరాజేశ్వరి రైస్ మిల్లులో డంప్ చేసిన తర్వాత రెండో ట్రిప్ లో పోలీసులకు దొరికిపోయినట్లు తెలిసింది. ఈ వ్యాపారి కొంతకాలంగా ఇలా డీలర్ల నుంచి పీడీఎస్ సన్నబియాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అయితే పౌరసరఫరాల శాఖ అధికారులు పీడీఎస్ సన్న బియ్యం అమ్మకాలు, రైస్ మిల్లర్లు కొనుగోలు చేస్తుండటం, వాటిని రైస్ మిల్లులోనే నిల్వ చేస్తుండటంపై చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండటం చర్చనీయాంశమైంది.



# మావోయిస్ట్ పార్టీ అగ్రనేత రాంధేర్ లొంగుబాటు

- ఆయన వెంట మరో 10 మంది అగ్రనేతలు
- వీరిలో ఆరుగురు మహిళా మావోయిస్టులు
- రాంధేర్ తలపై రూ.కోటి రివార్డు
- తాజా లొంగుబాటుతో మావోయిస్టు రహిత ప్రాంతంగా ఎంఎంసీ జోన్

అక్షరదర్బార్, భోపాల్: మావోయిస్ట్ పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్ మజ్జి సోమవారం తెల్లవారుజామున మధ్యప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఆయనతో పాటు మొత్తం 11 మంది అగ్ర కార్యకర్తలు ఉన్నారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు మహిళా మావోయిస్టులు ఉన్నారు. బకర్కట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంహి గ్రామంలో ఈ లొంగుబాటు జరిగింది. రాంధేర్ తన అనుచరులు తుపాకులను సైతం పోలీసులకు అప్పగించారు. రాంధేర్ లొంగుబాటుతో మధ్యప్రదేశ్ దాదాపుగా తిరుగుబాటు రహితంగా మారిందని అక్కడి పోలీసులు ప్రకటించారు. మహారాష్ట్ర– మధ్యప్రదేశ్– ఛత్తీస్‌గఢ్ జోన్ (ఎంఎంసీ) లోని ఉత్తర, దక్షిణ భాగాల్లో దాదాపు మావోయిస్టు పార్టీ ఉద్యమం దాదాపుగా అంతమైందని తెలిపారు. లొంగిపోయిన రాంధేర్ మజ్జి తలపై రూ.కోటి రివార్డు ఉంది. ఈ ప్రాంతంలో అనేక మావోయిస్టు దాడులకు ఆయనే ప్రధాన సూత్రధారి అని పోలీసులు తెలిపారు. దక్షిణ ఎంఎంసీ జోన్‌లో పనిచేసిన చివరి సాయుధ బృందానికి ఆయనే నాయకత్వం వహించాడని చెబుతున్నారు.

# తల్లి కళ్లముందే విద్యార్థిని దారుణ హత్య

- పెళ్లికి ఆమెతల్లిదండ్రులు అంగీకరించలేదనే అక్కసు
- మేనబావ ఉన్మాదం.. హైదరాబాద్ లో ఘటన

అక్షరదర్బార్, హైదరాబాద్హైదరాబాద్ వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఇంటర్ విద్యార్థిని (17) దారుణ హత్యకు గురైంది. మేనమామ వరుసయ్యే ఓ యువకుడు, యువతి తల్లి కళ్లముందే కత్తితో ఆమె గొంతు కోసి హత్య చేశాడు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన బాలిక, ఆమె తల్లిదండ్రులు బౌద్ధనగర్‌లో నివసిస్తున్నారు. బాలికకు మేనబావ అయిన ఉమాశంకర్ ఆమెను పెళ్లి చేసుకోవాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాడు. అయితే, ఉమాశంకర్ ప్రవర్తన సరిగా లేదంటూ వారు ఈ పెళ్లికి నిరాకరించారు. దీంతో కోపం పెంచుకున్న ఉమాశంకర్ సోమవారం బాలిక తల్లిదండ్రుల ముందే ఆమెపై దాడి చేశాడు. కత్తితో బాలిక గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. కళ్ల ముందే కన్నకూతురు రక్తపుమడుగులో పడి చనిపోవడంతో బాలిక తల్లి దిగ్భ్రాంతికి లోనైంది. కన్నీరుమున్నీరుగా విలపించింది. దారుణానికి పాల్పడిన యువకుడు ఘటనాస్థలిలోనే కత్తి, సెల్‌ఫోన్ వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వారాసిగూడ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. వారాసిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఉమాశంకర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజు మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915